క్లుప్తంగా

1న పైడితల్లి పండగ నిర్వహణపై సమావేశం

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి పైడితల్లి అమ్మవారి వార్షిక పండగ నిర్వహణపై వచ్చే నెల 1న సమావేశం నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కొండ దిగువ నృసింహసదన్‌లో సమావేశం జరుగుతుందన్నారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరుకావాల్సిందిగా కోరారు.

అప్పన్న సన్నిధిలో మైలవరపు కృష్ణతేజ



మైలవరపు కృష్ణతేజకు అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, డిప్యూటీ సీఎం సెక్రటరీ మైలవరపు కృష్ణతేజ (ఐఏఎస్) కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో అష్టోత్తర పూజ జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, చిత్రపటాలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ సుజాతనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి మెయిన్ రోడ్డు, ఎల్ఐసీ కాలనీ, దొగ్గవానిపాలెం, సుజాతనగర్, గోపాలకృష్ణనగర్, పాపయ్యరాజుపాలెం, గణేష్‌నగర్, పాపయ్యరాజుపాలెం పెట్రల్ బంక్, కార్మిక నగర్, శారదానగర్, హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

సబ్బవరం పరిధిలో..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధి, 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వాహణలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా ఫీడర్లలోని సబ్బవరం, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం, ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

- సబ్బవరం సెక్షన్-2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీంతో గుల్లేపల్లి ఫీడర్ పరిధి గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, మర్రిపాలెం, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

మళ్లీ లిఫ్ట్ కష్టాలు

- నెలకు రెండుమార్లు మరమ్మతులు
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు



మరమ్మతులకు గురైన దువ్వాడ రైల్వేస్టేషన్ లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ తరచుగా మరమ్మతులకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. లిఫ్ట్ ఏర్పాటు చేసి రెండేళ్లయినా, ఈ కాలంలో కనీసం 30 సార్లు పైగా మరమ్మతులకు గురైందని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో లగేజీలు, వృద్ధులు, పిల్లలతో ప్రయాణించే వారికి అగచాట్లు తప్పడం లేదు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు నుంచి ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానిస్తూ ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. అయితే, లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నెలకు కనీసం ఒకటి, రెండు సార్లు మరమ్మతులకు గురవుతోంది. సంబంధిత కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించకపోవడంతో మూడు నుంచి నాలుగు రోజుల పాటు లిఫ్ట్ నిలిచిపోతోంది. దీంతో ఒకటి నుంచి నాలుగు ప్లాట్‌ఫామ్‌కు రావాలన్నా, లేదా నాలుగు నుంచి ఒకటి ప్లాట్‌ఫామ్‌కు లగేజీలతో వెళ్లాలన్నా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైన లిఫ్ట్, మళ్లీ గురువారం ఉదయం నుంచి పనిచేయడం మానేసింది. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులను తిట్టుకుంటూ, ఎండలో లగేజీలు మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి, లిఫ్ట్ మరమ్మతులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మార్కెట్‌కు.. డైలీ సమస్యలు

సబ్బవరం మండలం.. చిన్నయ్యపాలెం డైలీ మార్కెట్.. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు సందడే సందడి. తాము పండించిన పంటలతో నాలుగైదు మండలాలకు చెందిన వందల సంఖ్యలో రైతులు.. కొనుగోలుకు వచ్చే టోకు, చిల్లర వర్తకులతోపాటు గృహ వినియోగదారులు వేలల్లో..! రోజూ రూ.లక్షల్లో లావాదేవీలు. అయితే ఈ మార్కెట్‌కు ఎలాంటి ఆశీల్ల దందా లేదు. అందుకేనేమో.. పాలకులు, అధికారులు దీన్ని పట్టించుకున్న పాపాన పోవట్లేదు. చిన్నపాటి వర్షం వచ్చినా.. అంతా బురదమయం. ఎన్నిసార్లు అధికార **యంత్రాంగానికి మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకోవట్లేదని రైతుల ఆవేదన.**

- సబ్బవరంతో పాటు చుట్టుపక్కల మండలాల ఉద్యాన రైతులకు ఇదే ప్రధాన మార్కెట్
- తాజా కూరగాయల కోసం విశాఖ పరిసర ప్రాంతాల నుంచీ జనాల రాక
- మార్కెట్‌కు వచ్చే రైతుల సంఖ్య పెరుగుతున్నా.. అభివృద్ధి ఊసే **లేదు**



తాజా వర్షాలకు చిత్తడిగా మారిన మార్కెట్.. బురదపైనే కూరగాయల మూటలు



కూరగాయల మూటలను బురదలోనే బజారులోకి మోసుకెళ్తున్న రైతు



వర్షం తాకిడికి మార్కెట్ బురదగా మారడంతో తగ్గిన రద్దీ



కేట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు



చిన్నయ్యపాలెం మార్కెట్: ఎండా వానల్లో ఇదే గతి

సబ్బవరం: మండలంలోని చిన్నయ్యపాలెం డైలీ మార్కెట్ మండలంలోనే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాలకు అతిపెద్ద మార్కెట్. సబ్బవరం మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోని గ్రామాల రైతులు, తాము పండించిన ఉద్యాన పంటలను నేరుగా ఇక్కడే విక్రయిస్తారు. తాజా సరకు కావడంతో గృహ వినియోగదారులతో పాటు, చిల్లర వర్తకులు, హోల్‌సేల్ వ్యాపారులు ఎక్కువగా వస్తుంటారు. హైవేను ఆనుకుని, విశాఖ సిటీకి కాస్త దగ్గరగా ఉండటంతో నగర వాసులు సైతం వివాహాది శుభకార్యాల సమయంలో తమ అవసరాలకు ఇక్కడే కూరగాయలను కొనుగోలు చేస్తారు.

రోడ్డు పెరిగి.. మార్కెట్ స్థలం తగ్గి..

మండలంలోని తవ్వవానిపాలెం శివారు చిన్నయ్యపాలెం సమీపంలో ఉన్న ఈ డైలీ మార్కెట్ సుమారు రెండెకరాల విస్తీర్ణంలో కొనసాగుతోంది. గతంలో మూడెకరాలకుపైనే ఉండేది. హైవే విస్తరణలో ఎకరం వరకూ మార్కెట్ స్థలం పోయింది. ఆ సమయంలో మార్కెట్‌కు వెళ్లేందుకు వీలుగా అండర్ పాత్ ఏర్పాటుకు రైతులు అధికారులకు విన్నవించారు. దాన్ని పట్టించుకోకపోవడంతో మార్కెట్ మరీ ఇరుగ్గా మారింది. ఇక్కడ మిగతా మార్కెట్లు, సంతల మాదిరి పంచాయతీ అజమాయిషీ, దళారీ వ్యవస్థ ఉండదు. దీంతో రైతులు ముందురోజు సాయంత్రం కోసిన పంటను మరుసటి రోజు వేకువ జామున నేరుగా ఇక్కడికే తెచ్చి, విక్రయించేందుకు మొగ్గు చూపుతారు.

రైతుబజార్లకూ ఇదే ఆధారం

స్థానిక రైతుల బజార్లతోపాటు నగర పరిధిలోని పెందుర్తి, గోపాలపట్నం, మర్రిపాలెం, కంచరపాలెం తదితర రైతు బజార్లలో కార్డులున్న రైతుల్లో చాలా మందికి ఈ మార్కెట్ ఆధారంగా నిలుస్తుంది. ఒకటి రెండు కూరగాయలు మాత్రమే పండించే రైతులు మరి కొన్ని రకాల కూరగాయలను ఇక్కడి నుంచే కొనుగోలు చేసి, తమ స్టాళ్లకు తీసుకెళ్తారు.

వర్షాకాలం వచ్చిందా.. అంతే!

మార్కెట్ ప్రాంతంలో ఏ చిన్నపాటి వర్షం కురిసినా అంతా బురదమయంగా మారుతుంది. ప్రస్తుతం వర్షాకాలం సమీపించి, అకాల వర్షాలు కురుస్తుండటంతో డైలీ మార్కెట్ చిత్తడిగా మారింది. దీంతో రైతులు తాము తెచ్చిన కూరగాయలు అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటను విక్రయించడానికి మరోదారి లేని రైతులు తమ సరకును రోడ్డు మీదికి తీసుకురాక తప్పని స్థితి. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు, ప్రమాదాల పేరిట పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 6 మాసాల క్రితం తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ.. ఇప్పటికీ హామీగానే ఉంది.

తాజా సరకు.. అందుబాటు ధర



చిన్నయ్యపాలెం మార్కెట్‌లో హోల్‌సేల్‌లో నిమ్మకాలు అమ్ముతాను. వీటితో పాటు మా స్వగ్రామం తవ్వవానిపాలెంలో మా పొలాల్లో వేసిన ఉద్యాన పంట ఫలాలను మార్కెట్‌కు తీసుకొచ్చి, విక్రయిస్తా. ఇక్కడ కాయగూరలు తాజాగా, సరసమైన ధరల్లో వినియోగదారులకు లభిస్తాయి. దీంతో ఇక్కడ ఎక్కువగా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. – బోకం శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం

వర్షం పడితే చాలా ఇబ్బంది



మా పొలాల్లో పండిన కూరగాయల్ని చిన్నయ్యపాలెం బజార్‌కు తీసుకెళ్తాం. రోజూ ఉదయం పూట బజార్ ఉండటంతో గృహ అవసరాలకు కొనుగోలుచేసేవారితో పాటు చిరు వ్యాపారస్తులు కూడా ఇక్కడికే వస్తారు. వర్షం పడితే మాత్రం మార్కెట్‌లో అడుగు పెట్టే అవకాశం ఉండదు. దీంతో తెచ్చిన కూరగాయల్ని ఎంతో కొంతకు అమ్ముకోవాల్సిన దుస్థితి. – ఉప్పలి దుర్గారావు, గుల్లేపల్లి

మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి



మాకున్న రెండెకరాల్లో 80 సెంట్ల వరకూ వంగ, టమాటా, బెండ వంటి కూరగాయలు వేస్తాం. నిత్యం చేతికి వచ్చిన కూరగాయలను చిన్నయ్యపాలెం మార్కెట్‌కు తీసుకెళ్లి, విక్రయిస్తుంటాం. మా గ్రామం నుంచి మార్కెట్‌కు వెళ్లాలంటే సుమారు 11 కిలో మీటర్లు ప్రయాణించాలి. మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తే మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగం. – పిల్లల స్వామినాయుడు, రాయపుర అగ్రహారం

రాజకీయ కక్షతోనే చెక్ పవర్ రద్దు

- వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు

పరవాడ: రాజకీయ కక్ష సాధింపులకు కూటమి నేతలు తెర తీసి, ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌పై వేధింపులకు పాల్పడుతున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. కూటమి నేతల ప్రోద్బలంతో వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావుకు మూడు నెలల పాటు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులు గురువారం ఉత్వర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షలతో గ్రామాభివృద్ధికి ఎక్కడికక్కడ ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అప్పారావు సాక్షితో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులను అణగదొక్కాలన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు తనపై రాజకీయ దురుద్దేశంతో లేనిపోని అవినీతి ఆరోపణలు చేసి, చెక్ పవర్ రద్దు చేయించారని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా వెన్నలపాలెంలోని కల్యాణ మండపానికి సంబంధించి రూ.21 లక్షల నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారన్న కూటమి నాయకులు ఫిర్యాదుతో సర్పంచ్ చెక్ పవర్‌ను మూడు నెలల పాటు నిలుపుదల చేస్తున్నట్లు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- మేహాద్రి, ఇతర ప్రాంతాల్లో నిఘా
- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక



పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌తో పాటు ఇతర బహిరంగ ప్రాంతాల్లో మద్యం పార్టీలు, జూదం తదితర చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ మేహాద్రి, నల్లక్వారీ ప్రాంతాల్లో పార్టీలు చేసుకుని ఈతకు దిగి మృత్యువాత పడడం విషాదకరమన్నారు. ఇకపై ఆయా ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెడతామని తెలిపారు. అవసరమైన చోట డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ దేవతల పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా పూర్తిగా నిషిద్ధమని పేర్కొన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్‌లో తుది మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాముునాయుడుకు అదీప్‌రాజ్ పరామర్శ



పార్టీ నాయకులతో కలిసి రామునాయుడుని పరామర్శిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోకం రామునాయుడును మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. మండలంలోని గుల్లేపల్లిలో ఉన్న రామునాయుడు నివాసానికి గురువారం వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ జెడ్పీటీసీ, పార్టీ అధికార ప్రతినిధి కొటాన రాము, జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఇథలిన్‌తోనే పండ్లు మగ్గబెట్టాలి



మామిడి పండ్లు

పెందుర్తి: మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ సాయంతో మగ్గబెట్టడం మంచిది కాదని ఉద్యానశాఖ అధికారి జి.సోని అన్నారు. దీని వలన ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. గురువారం సాక్షితో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన మామిడి పళ్లను ఇథలిన్ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను గాలి చొరబడని గదిలో ఉంచి ఇథలిన్ వాయువు 2 పీపీహెచ్‌ను స్ప్రే చేసి 16 గంటల తరువాత తీస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయన్నారు. లేదా బకెట్ నీటిలో ఇథలిన్ ద్రావణం, కాస్టిక్ సోడా కలిపి చల్లిన తరువాత 24 గంటలు ఉంచాలన్నారు. దీని వలన ఇథలిన్ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బైడ్‌ను వాడరాదని స్పష్టం చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అధ్వాన రోడ్డుతో వాహనదారుల అవస్థలు



పాత ఇటుకల పరిశ్రమ వద్ద ఛిద్రమైన రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో పలు చోట్ల పడిన భారీ గుంతలతో రాత్రి సమయంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏడాది తిరక్కుండానే రహదారి మరమ్మతులకు గురవడం పట్ల ప్రయాణికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో పాత ఇటుకల పరిశ్రమ, ఊటగెడ్డ జంక్షన్, ఎన్టీపీసీ వద్ద పలు చోట్ల రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా తయారైన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానా



ఎస్.నరసింగరాజు, పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ

పెందుర్తి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరసింగరాజు సూచించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం తలకు గాయాలు కావడం వలనే మరణాలు సంభవిస్తున్నాయని, అందుకే ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. లేదంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి చినముషిడివాడకు చెందిన ఎస్.నర్సింగరావు రూ.లక్ష 116 విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్లో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 63 మంది ఎంపిక



నియామక పత్రాలతో అభ్యర్థులు, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

పెందుర్తి: స్థానిక బాలాజీ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. 14 కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం జరిగిన ఇంటర్వ్యూలకు మొత్తం 248 మంది హాజరయ్యారు. వారిలో 63 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు. ఇంటర్వ్యూల్లో ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు.. విజ్ఞాన లోగిళ్లు



పెందుర్తి గ్రంథాలయంలో విద్యార్థులు



అడవివరం గ్రంథాలయంలో పాట పాడుతున్న విద్యార్థి

పెందుర్తి: మండలంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాలు వేదికగా జరుగుతున్న శిబిరాలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం వారిచే నచ్చిన పుస్తకం పేరిట సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాలను నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానంపై మెళకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

సంగీతం సర్వరోగ నివారిణి

సింహాచలం: సంగీతాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, సంగీతం సర్వరోగ నివారిణిగా కూడా పనిచేస్తుందని ఎన్ఎస్‌టీఎల్ విశ్రాంత ఉద్యోగి పి.కనికిరెడ్డి అన్నారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. పాల్గొన్న కనికిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉద్యోగం చేస్తూ సంగీతంపై మక్కువతో సొంతంగా శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలతో పాటలు పాడించారు. కార్యక్రమంలో పాల్గొన్న జింక్ విశ్రాంత ఉద్యోగి పి.ప్రసాదరావు మాట్లాడుతూ సంగీతం నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి, ఆరోగ్యం మెరుగుపడేందుకు దోహదపడుతుందన్నారు. పిల్లల ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎస్ రాజు, విశ్రాంత హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి, సంగీత శిక్షకుడు బ్రహ్మాజీరావు, గ్రంథాలయాధికారి ఎస్.వి. నరసింహం పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో ఆహార నాణ్యత తనిఖీలు

సబ్బవరం: మండలంలోని ఫ్యామిలీ రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాల్లో వారానికోసారి ఆహార నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. సబ్బవరం-చోడవరం రోడ్డులోని గాలిభీమవరం సమీపంలో ఉన్న దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ దాబాలో ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ, పోలీస్ విభాగాల అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నికృష్ణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లలో ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాబాలోని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన తందూరీ చికెన్, పన్నీరు నమూనాలను హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ లేబరేటరీకి పంపినట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి వచ్చే పరీక్ష ఫలితాల్లో ఆహార నాణ్యత తేడాలున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. స్వీట్ స్టాళ్లు, జ్యూస్ సెంటర్లలో ఫుడ్ కలర్స్ 100 పీపీఎం మోతాదుకు మించి వినియోగించరాదన్నారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ వీరయ్య, ఎస్ఐ దివ్య, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.